క్లుప్తంగా

22న పూలపల్లిలో పాస్టర్లకు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు అర్బన్: ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు పూలపల్లి ఎలీమ్ స్కూల్ ఆవరణలో పాలకొల్లు పట్టణ, రూరల్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు గోబేరు కృపా శ్యాంసన్ సోమవారం తెలిపారు. బీపీ, సుగర్, కిడ్నీ, కేన్సర్, సాధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదావకాశాన్ని పట్టణ, రూరల్ గ్రామాల్లో పనిచేస్తున్న పాస్టర్ల కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆశక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సోమవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కథలు చెప్పడం, యోగా, గణితం సబ్జెక్ట్‌లో మెళుకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు.. వచ్చేనెల 7వతేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, నాగలక్ష్మి, సు. దీర్‌మోహన్, సూర్యంబాబు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం



సిద్ధాంతంలో మిత్రుడికి ఆర్థిక సహాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుగొండ: తమతోపాటు విద్యనభ్యసించిన మిత్రుడు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో అప్పటి 1990–91 పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం చేసి మిత్ర ధర్మాన్ని చాటుకొని అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే పెనుగొండ మండలం, సిద్ధాంతం గ్రామం చెరువుపేటకు చెందిన చిన్నం భూషణం కొంతకాలం నుంచి కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మిత్రుడి ఇబ్బందులు గుర్తించిన సిద్ధాంతం జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు హెల్పింగ్ హాండ్స్ అనే పేరుతో వెళ్లి రూ.51,600 భూషణానికి అందజేశారు.

యువకుడిని రక్షించిన స్నేహితులు, సందర్శకులు



గల్లంతైన యువకుడిని రక్షించి తీరానికి తీసుకువస్తున్న స్నేహితులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌లో సోమవారం సముద్ర స్నానం చేస్తూ గల్లంతైన యువకుడ్ని స్నేహితులు, సాటి సందర్శకులు రక్షించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండకు చెందిన 10 మంది యువకులు క్యాటరింగ్ పనినిమిత్తం నరసాపురం వచ్చారు. వారు తమ పనులు ముగించుకుని మధ్యాహ్నం నుంచి బీచ్‌కు వచ్చారు. కొంతసేపు సేదతీరిన తరువాత సముద్ర స్నానానికి దిగారు. సముద్రంలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ అలల ఉధృతికి దొంగ గౌతమ్ (20) కొట్టుకు పోతుండగా తోటి స్నేహితులు, అక్కడే స్నానం చేస్తున్న సందర్శకులు యువకుడిని పట్టుకుని రక్షించారు. అప్పటికే గౌతమ్ సముద్రపు నీరు మింగడంతో తీరానికి తీసుకు వచ్చిన వెంటనే 108 వాహనంలో మెరుగైన చికిత్స నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మొగల్తూరు ఎస్సై కె వెంకటరమణ కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉండి: దిచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి పడవలరేవుకు చెందిన కెంగం ప్రవీణ్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఉప్పులూరు వైపుకు బయలుదేరాడు. అయితే అతను గణపవరం రోడ్డులో వెలివర్రు జంక్షన్‌కు రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఇతనిని ఢీకొన్నాడు.ఈ ఘటనలో ప్రవీణ్ గాయపడటంతో అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై ఏ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సేవలు



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆకివీడు సీహెచ్‌సీ భవనం



సీహెచ్‌సీలో పసికందులకు అందుబాటులో ఉన్న పాటోథెరపీ, వామర్



నూతనంగా అందుబాటులోకి వచ్చిన ఎక్స్‌రే

- పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం
- అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలు
- వైద్య పరీక్షలకు పరుగులు తీసే పరిస్థితికి స్వస్తి

ఆకివీడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రం స్థాయి గుర్తింపు పొంది 30 పడకల ఆస్పత్రిగా ఉన్న ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) రోజు రోజుకరూ అభివృద్ధి చెందుతూ ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తుంది. వైద్యుల కొరత, మందుల కొరత, సిబ్బంది కొరత, సౌకర్యాల కొరతతో కొట్టుమిట్టాడిన సామాజిక ఆరోగ్య కేంద్రం ఇప్పుడు పుష్కలంగా అన్ని సదుపాయాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తుంది. ఇటీవల కాలంలో రోగుల సంఖ్య కూడా పెరిగింది. ఆస్పత్రిలో ఏడుగురు వైద్య సిబ్బంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు వైద్యులు సేవలందిస్తున్నారు. చిన్న పిల్లల వైద్యుల పోస్టు ఖాళీగా ఉంది. ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టు, హెడ్ నర్సు, సీహెచ్‌ఓ తదితర పోస్టులలో సిబ్బంది పూర్తి సేవలందిస్తున్నారు.

మెరుగుపడిన సౌకర్యాలు, సేవలు

ఆస్పత్రిలో అరకొర సేవలతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. దూర ప్రాంతం నుంచి సీహెచ్‌సీకి వచ్చిన తర్వాత వైద్యులు అందుబాటులో లేకపోవడం, ఒకే వైద్యుడు రోగుల్ని పరీక్షించడం వంటి వాటితో రోగులు విసుగుచెంది ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లేవారు. ఆ దుస్థితి రోగులకు తప్పింది. ఆస్పత్రిలో వివిధ సేవల్ని రోగులకు పూర్తి స్థాయిలో అందజేస్తున్నారు.

అందుబాటులో నూతన పరికరాలు

ఆకివీడు సీహెచ్‌సీలో ఆధునిక పరికరాల్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈసీజీ, ఎక్స్‌రే, యూరిన్, నాలుగు రకాల రక్త పరీక్షలకు సంబంధించిన పలు పరికరాలు, టీబీ, ఈఎస్సార్, కొలెస్ట్రాల్, జాండీస్, ఇన్‌ఫెక్షన్, ప్లేట్‌లెస్, వంటి పరీక్షలు, ఆపరేషన్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. తదితర పరీక్షలతో పాటు వైద్య సేవలందించడంతో ప్రస్తుతం ప్రతీ రోజూ 100 నుంచి 150కి పైగా రోగులు వైద్య సేవల్ని పొందుతున్నారు.

మెరుగైన సౌకర్యాలు

ఆకివీడు సీహెచ్‌సీలో మెరుగైన సౌకర్యాలు రోగులకు అందుబాటులో ఉన్నాయి. 30 పడకల హాలులో ఏసీలను దాతలు సమకూర్చారు. జనేరటర్, ఇన్వేటర్, చిన్న పిల్లలకు సంబంధించి 7 ఫోటో థెరఫీలు, 5 వామర్‌లు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌ల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయి.

త్వరలో నూతన భవనం పారంభం

సీహెచ్‌సీలో రోగుల సంఖ్య పెరగడం, ఆస్పత్రిలో మరిన్ని మెరుగైన సేవల్ని అందజేసేందుకు ప్రభుత్వం రూ. 50 లక్షలతో మరో నూతన భవనం నిర్మించారు. భవనాన్ని త్వరలో ప్రారంభించాల్సి ఉంది. నూతన భవనం ప్రారంభించడం ద్వారా మరింత వెసులుబాటు కలిగే అవకాశం ఉంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరంలోని టిడ్కో విద్యుత్ ఉపకేంద్రం నుంచి పెదగరువు వెళ్లే 33/11 కేవీ హెటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం తెలిపారు. పెదగరువు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో తాడేరు, యమునాపల్లి, కొత్రపాడు, బేతపూడి, కరుకువాడ, పెదగరువు, చినగరువు, రాజుల గరువు, వెంప, శ్రీరామపురం, తుందుర్రు, జొన్నలగరువు, దూసనపూడి, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, బాలేపల్లి గ్రామాలతో పాటు తుందుర్రు గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కుకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని కోరారు.

వెంకటేశ్వర స్వామికి అభిషేకాలు



స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జె.పి రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఆలయ ఈవో రుద్రరాజు గంగాశ్రీదేవి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శ్రీవారికి, అమ్మవారికి వేదోక్తంగా పంచామృతాలతో అష్టోత్తర (108) కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం నిత్యోపాసణ బలిహరణ, హోమాలు నిర్వహించారు. 21న 108 తులసి మొక్కలతో తులసి బృందార్చన, అష్టదళ పాద పద్మారాధన, సాయంత్రం స్వామివారికి పట్టువస్త్రాలు అందజేత, 22న పద్మావతి అమ్మవారికి సామూహికంగా భక్తులచే లక్ష కుంకుమార్చన, సాయంత్రం రథోత్సవం, అమ్మవారికి వివిధ రకాల పరిమళ పుష్పములతో పుష్పయాగోత్సవం, 23న పూర్ణాహుతి, 25న అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో గంగాశ్రీదేవి తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంతెన రామకుమార్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వ్యాపారిపై దాడి

ఉండి: రోడ్డు పపక్కన చేపలు అమ్ముకుంటున్న వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి భవానీపేటకు చెందిన చేవూరి రాజశేఖర్ చేపలు పట్టుకుని విక్రయిస్తాడు. ఇదే క్రమంలో ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఉండి గణపవరం రోడ్డులోని మద్యం దుకాణానికి సమీపంలో రోడ్డు పక్కన చేపలు విక్రయిస్తుండగా ఉండికి చెందిన మునగాల వినయ్‌కుమార్, మరో ఇద్దరితో కలిసి వచ్చి చేపలు బేరమాడాడు. బేరం కుదరకపోవడంతో రాజశేఖర్‌పై దౌర్జన్యం చేసి చేపలు అన్నీ ఇచ్చేయాలని డిమాండ్ చేసాడు.దానికి రాజశేఖర్ ససేమిరా అనడంతో ఆగ్రహించి వినయ్‌కుమార్‌తోపాటు వెంట వచ్చిన వారు దౌర్జన్యంగా కర్రతో, చేతులతో కొట్టారు. ఈ దాడిలో రాజశేఖర్ గాయపడ్డాడు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు.

రాజీవ్‌కాలనీలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



పెనుమంట్ర రాజీవ్ కాలనీలో తనిఖీలు నిర్వహిస్తున్న పెనుగొండ సీఐ రజనీకుమార్, సిబ్బంది



పెనుమంట్ర స్టేషన్ వద్ద సిబ్బందికి తనిఖీ విషయంలో సూచనలు అందజేస్తున్న సీఐ రజనీకుమార్, ఎస్సై రవీంద్రబాబు

పెనుమంట్ర: పెనుమంట్ర రాజీవ్‌కాలనీలో సోమవారం పెనుగొండ సీఐ ఎం రజనీకుమార్ ఆధ్వర్యంలో పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట ఎస్సైలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అనుమానాస్పద వ్యక్తులు, పత్రాలు లేని వాహనాలు, తనిఖీ చేసి సుమారు 30 మోటారు వాహనాలను సీజ్‌చేసి స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలు తనిఖీ చేసి అనంతరం వాహనదారులకు వాహనాలను అప్పగించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని వాహనాలతో వ్యక్తులు సంచరిస్తున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై సమాచారాన్ని పోలీసులకు తెలపాలని సీఐ గ్రామస్తులకు వివరించారు.

ఘనంగా స్వామి వారికి మల్లెల పుష్పార్చన



ప్రత్యేక అలంకరరణలో వెంకటేశ్వరస్వామి



కాళ్ళకూరు వెంకటేశ్వర స్వామికి మల్లెపూలార్చన చేస్తున్న అర్చకులు. →

కాళ్ల: కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మల్లెపూలార్చన నిర్వహించారు. కాళ్లకూరు గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు స్వామివారికి ఉదయం నిత్యోపాసన బలిహరణ, అష్టోత్తర సేవ నిర్వహించారు. శత(108) మల్లెల పుష్పార్చన, శేష వాహన సేవ గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం అరుణ్ కుమార్, ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జీవితంలో ఆధ్యాత్మికతకు చోటు ఇవ్వాలి



డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆధ్యాత్మిక చింతన లేని జీవితం వ్యర్థమని, దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతకు కొద్దిగా చోటు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న అతిరాత్ర మహాయాగంలో భాగంగా ఆరో రోజు పంచమ చితి ఉపదానం, ప్రవర్గ్య పసత్, సుబ్రహ్మణ్య ఆహ్వానం, దేవతార్చన, మూలమంత్ర జపములు, పారాయణం, ఈశ్వరునికి అభిషేకాలు 126 మంది వేద పండితులతో వేద ఘోష సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో నిర్వహించామని యజ్ఞ కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శ్యామల మాట్లాడుతూ అతిరాత్ర మహాయాగం దర్శనం తర్వాత నాలో ఒక ఆధ్యాత్మిక అనుభూతి కలిగిందన్నారు. రెండో పట్టణ సిఐ జి శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు చీడే సత్యనారాయణ, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, ఎస్ఆర్ కేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీ కృష్ణంరాజు, డీఎన్నార్ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రాఘురామ్, యజ్ఞ పర్యవేక్షకుడు చెరుకువాడ రంగసాయి, కంతేటీ వెంకటరాజు, నరహరిశెట్టి కృష్ణ, నడింపల్లి బంగార్రాజు, కొండ్రు శ్రీనివాస్ యాగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



పాలకోడేరు మెయిన్ రోడ్డు పై మురుగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరు గరువు వద్ద మెయిన్ రోడ్డు..పంచాయతీ డ్రెయిన్ పూడుకు పోయి, ఆ వ్యర్థపు నీరంతా రహదారి పైకి వచ్చి ప్రవహిస్తోంది. నాచు కూడా పట్టింది. పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కనీసం అక్కడి వార్డ్ సభ్యుడు కూడా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఎవరికీ చెప్పుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది తెలియడం లేదని అక్కడి వారు వాపోతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ ఆంజనేయులు వివరణ కోరగా త్వరగా వెంటనే చర్యలు చేపడతామని బదులిచ్చారు.

14 రౌండ్లలో ఆచంట ఫలితం



ఆచంటలో స్టాండింగ్ కమిటీ సమావేశం

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం నుంచి అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించి 14 రౌండ్లు లెక్కింపు ఉంటుందని, అనంతరం ఫలితం ప్రకటిస్తారని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి స్వామినాయుడు తెలిపారు. సోమవారం ఆచంటలో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఇవి కాక, 4టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటుందన్నారు. 18 మంది కౌంటింగ్ ఏజెంట్లకు అనుమతి ఇస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంటు కోసం ఆయా అభ్యర్థుల తరపు ఫాం–18 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారు, వారికి కేటాయించిన టేబుళ్ల వద్ద మాత్రమే ఉండాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్‌తో లెక్కింపు మొదలు పెడతామన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లులో చట్టపరమైన నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఉదయం 7 గంటలలోపే చేరుకోవాలని, మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఒక్కో హాలులో గరిష్ఠంగా 18 మంది ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఫారం–17 సిలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లతో సరిచూస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బంది, రిజల్ట్ సంఖ్యను ఫారం17 సీ, పార్ట్ 2 నమోదు చేసుకొని ఏజెంట్ల సంతకం తీసుకుంటామన్నారు. ఒక్కో రౌండ్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఆయా పార్టీల ఏజెంట్లతో పాటు, తహసీల్దార్లు ఆర్‌వీవీ రోహిణీ దేవి, కె.లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవోలు పి.నరసింహ ప్రసాద్, ఎస్ శ్రీనివాస్ దొర, పి పద్మజ, ఎలక్షన్ డీటీ ఎం రాంప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహిద్దాం



యండగండి డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఉండి: విద్యార్థులు, చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను ఆయా సందర్భాల ద్వారా పోత్సహించాలని యండగండి గ్రంథాలయాధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ అన్నారు. యండగండి గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా సోమవారం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమలోని చిత్రలేఖన ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి దానికి చేయూతనిస్తే వారు భవిష్యత్‌లో చాలా గొప్పవారవుతారని అన్నారు. కుటుంబమే కాదు దేశం గర్వపడేలా వారంతా ఎదుగుతారని అన్నారు. అందుకే వేదిక ఏదైనా చిన్నారులను ప్రోత్సహిస్తే వారు మరింతగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్, కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 309మందికి ఉద్యోగాలు



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 309 మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి సోమవారం విలేకర్లకు చెప్పారు. గత 20 రోజులుగా వివిధ కంపెనీలు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించాయని వాటిలో 60 మంది విద్యార్థులు ఎంఎస్ఎన్ ల్యాబ్, ఆరబిందో, హెటరో వంటి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఇంకా డీఎఫ్‌సీఎల్, శ్రీసిటి ఇపాక్, థింక్ సింక్, కనెక్ట్, హెక్సావేర్, ఫ్యూజన్ సి ఎక్స్, అల్ సెక్, స్కిల్ దునియా వంటి కంపెనీల్లో కొలువులు పొందారని ప్రిన్సిపాల్ శాంతకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు తదితరులు అభినందించారు.